

గేట్స్‌లో ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న నోడల్ అధికారి జీవీ.రాజ్ కుమార్

ప్రజాశక్తి-గుత్తి

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓటు హక్కుపై సోమవారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోడల్ అధికారి జివి.రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈనెల 18వ తేదీ వరకు నూతనంగా ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.భారతి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇఇ పిఎం.మంజునాథ్, గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, విద్యార్థులు పాల్గొన్నారు.


మూల్యంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ బి.వరలక్ష్మి

పది మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం జిల్లాకు సంబంధించి పది మూల్యాంకనం ప్రారంభం అయ్యింది. జిల్లా కేంద్రంలోఇ కెఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల హైస్కూల్లో సోమవారం ఉదయం ప్రారంభం అయ్యింది. మూల్యాంకానికి సంబంధించి అన్ని సబ్జెక్టులకు 653 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీరికి అదనంగా 300 మంది స్పెషల్ అసిస్టెంట్‌లను నియమించారు. సోమవారం ప్రారంభమైన మూల్యాంకనం కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూల్యాంకనం సజావుగా జరిగేందుకు పర్యవేక్షణ కోసం ఎనిమిది మంది క్యాంపు ఆఫీసర్లను నియమించామన్నారు. డిప్యూటీ క్యాంపు ఆఫీసర్(అడ్మిన్)గా డిప్యూటీ డిఇఒ శ్రీదేవి వ్యవహరిస్తారన్నారు. పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్ జవాబు పత్రాల భద్రతలో భాగంగా డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. ఏప్రిల్ 8 తేదీ వరకు మూల్యాంకన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. వేసవి దృష్ట్యా మూల్యాంకనం కేంద్రంలో ఉపాధ్యాయులకు అన్ని వసతులూ ఏర్పాటు చేశామని డిఇఒ తెలియజేశారు.

పింఛన్లు, రేషన్ బియ్యం అందించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్


వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు ప్రతి నెలా అందించే పింఛన్లు, రేషన్ బియ్యంలో ఎలాంటి సమస్యలూ లేకుండా అందించేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూలు నేపథ్యంలో వాలంటీర్ల ద్వారా పింఛన్లు, రేషన్ పంపిణీని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించిందన్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పేదలకు వాటిని అందించే ఏర్పాటు చేయాలని కోరారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు పింఛన్లను అందించడానికి అవసరమైన సిబ్బందిని తక్షణం ఏర్పాటు చేసి ఇంటి దగ్గరే వారికి పంపిణీ చేయాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో పాటు పనులు లేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం, ఇతర సరుకుల పంపిణీని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ నెలలో ముఖ్యమైన ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలు ఉన్న నేపథ్యంలో రేషన్ సరుకులు త్వరగా ప్రజలకు ఇవ్వాలన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం పేదల పథకాలను ఉపయోగించుకోవాలని చూడడం సరికాదన్నారు. పింఛన్, రేషన్ సరుకుల పంపిణీ ఆలస్యమైతే సిపిఎం ఆధ్వర్యంలో పేదల పక్షాన ఆందోళన చేపడుతామని రాంభూపాల్ తెలియజేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు

సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద్ రావు


ప్రత్యేక అవసరాల పిల్లలకు జరుగుతున్న వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద్ రావు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వారి వైకల్య తీవ్రతను బట్టి అధునాతన ఉపకరణాలను అందజేస్తామని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వరప్రసాదరావు తెలిపారు. సోమవారం గుత్తి భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆడియాలజీ, ఆర్థోపెడిక్ , నరాల సమస్యలు గల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ హాజరై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఐదు కేంద్రాల్లో వైకల్య మాపన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుత్తిలో దాదాపు 150 మంది పిల్లలకు వైకల్య పరీక్షలు నిర్వహించినట్లు తెలియజేశారు. వారి అవసరాన్ని బట్టి పరికరాలను అందించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ షమ, ఆల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ కె.గోవిందరెడ్డి, గుత్తి మండల విద్యా శాఖ అధికారి మనోహర్ పాల్గొన్నారు.

నార్పలలో ఫర్టిలైజర్స్ యజమాని దారుణహత్య

వ్యాపార, ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం..?


హత్యకు గురైన వీరభద్ర

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల కేంద్రంలోని కూతలేరు బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి 7-30గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఎరువుల దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని గొడ్డలితో నరికి హత్య చేశారు. ఈ హత్యతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఇందుకు సంబంధించి మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పులివెందులకు చెందిన వీరభద్ర(40) పది సంవత్సరాల క్రితం నార్పలకు వచ్చిన ఎరువుల దుకాణం ఏర్పాటు చేశారు. దుకాణం ప్రారంభ సమయంలో తన సమీప బంధువైన రఘు భాగస్వామ్యంతో కలిసి దుకాణాన్ని నిర్వహించేవాడు. కొంతకాలం తర్వాత ఇద్దరికీ వ్యాపార ఆర్థికవాదేవీల్లో వివాదాలు మొదలయ్యాయి. దీంతో ఇద్దరూ విడిపోయారు. విడిపోయిన అనంతరం ఎవరికి వారు నార్పలలో వేర్వేరుగా ఎరువుల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దుకాణాలు వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్నా ఇద్దరి మధ్య ఆర్థిక పరమైన ఘర్షణలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి 7-30 గంటల ప్రాంతంలో రఘు మరో వ్యక్తితో కలిసి వీరభద్ర ఎరువుల దుకాణం వద్దకు వెళ్లారు. అప్పటికే తనతో పాటు తీసుకెళ్లిన గొడ్డలితో రఘు వీరభద్రపై దాడి చేశారు. ఈ దాడిలో వీరభద్ర తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. ఆర్థిక లావాదేవీల విషయంలో రఘు ఈ హత్యకు పాల్పడ్డాడని మృతుని బంధువులు పోలీసులకు తెలియజేశారు. హత్య విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతుని భార్య, బంధువులతో వివరాలను సేకరించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు. హత్యకు సంబంధించిన దశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు కావడంతో పోలీసులు వాటిని పరిశీలిస్తున్నారు.

మౌనంగా సాగిన మేమంతాసిద్ధం..!

- ప్రసంగాలు లేకుండానే ముఖ్యమంత్రి బస్సుయాత్ర
- అభివాదాలు.. పలకరింపులతోనే సరి
- ఉమ్మడి జిల్లాలో ముగిసిన జగన్ పర్యటన


మేము సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్నవైసిపి శ్రేణులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి


కదిరిలో ముస్లిములతో కలిసి ప్రత్యేక ప్రార్థనలుచేస్తున్న జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగిసింది. శనివారం నాడు కర్నూలు జిల్లా తుగ్గలి నుంచి ప్రారంభమైన ఆయన యాత్ర అదే రోజు మధ్యాహ్నం గుత్తి మండలంలోకి ప్రవేశించింది. గార్లదిన్నె, అనంతపురం మీదుగా రాప్తాడు నుంచి సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురం వరకు సాగింది. ఆదివారం నాడు యాత్రకు విరామం ఇవ్వడంతో అక్కడే బస చేశారు. సోమవారం ఉదయం సంజీవపురం నుంచి ప్రారంభమైన యాత్ర బత్తలపల్లి, ముదిగుబ్బ, నాగారెడ్డిపల్లి మీదుగా రాత్రికి కదిరి చేరుకుంది. అక్కడి నుంచి రాత్రికి అన్నమయ్య జిల్లా చీకటిమానుపల్లి వద్ద ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బస చేశారు. అక్కడికి చేరుకునే సరికి సమయం చాలా ఆలస్యమైంది. బత్తలపల్లి, ముదిగుబ్బ, కదిరి పట్టణాల్లో భారీ జనసందోహం నెలకొంది. పెద్దపెద్ద గజమాలలతో ముఖ్యమంత్రికి భారీ పెద్దఎత్తున స్వాగతాలు పలికారు. భారీ జనందోహం నడుమ నిర్ణీత సమయం ప్రకారం పర్యటనలు సాగలేదు. రెండు,మూడు గంటలు ఆలస్యంగానే రెండు రోజుల పర్యటనలు సాగాయి. ఈ ఆలస్యం కారణంగా కదిరిలో ఇఫ్తార్ విందుకు కూడా సాయంత్రం ఐదు గంటలకు రావాల్సింది రాత్రి ఎనిమిది గంటలకు వెళ్లారు.

మౌనంగా ముగిసిన పర్యటన

ఎన్నికల సమయం కావడంతో ముఖ్యమంత్రి పర్యటనలో వాడీవేడి ప్రసంగాలుంటాయని అందరూ భావించారు. ప్రతిపక్షాలపై విమర్శలతోపాటు, ఐదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం గురించి పెద్దఎత్తున ప్రజలకు వివరిస్తారని అందరూ భావించారు. కాని ఉమ్మడి అనంతపురం జిల్లాలో గుంతకల్లు, శింగనమల, అనంతపురం, రాప్తాడు, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించినా ఎక్కడా ఎటువంటి ప్రసంగాలూ లేకుండా సాగాయి. ప్రజలకు అభివాదాలు చేస్తూ అవకాశమున్న చోట సామాన్య జనాన్ని కలుస్తూ యాత్రను ముగించారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన హామీలు కూడా ఏవీ లేకుండానే సాగాయి. దీంతో ఆయన పర్యటనపై ప్రతిపక్షాలు ప్రతి విమర్శలు చేయడానికి పెద్దగా అవకాశం లేకుండా సాగింది.

ఇద్దరు ముఖ్య నేతలు వైసిపిలో చేరిక

ముఖ్యమంత్రి చేపట్టిన మేమంతా సిద్ధం యాత్ర సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు ముఖ్య నేతలు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. అందులో కళ్యాణదుర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు ఒకరు కాగా, కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా మరొకరు. టిక్కెట్లు ఆశించి రాకపోవడంతో ఈ ఇద్దరు నేతలు పార్టీని మారారు. వీరితోపాటు మాజీ ఎంపిపి, జడ్పిటిసిలు ఇతర నాయకులు మరికొంత మంది పార్టీలో చేరారు.

అడుగంటిన బోర్లు.. ఎండిన చీనీ తోటలు


ఎండిన చీనీ చెట్లను చూపుతున్న రైతు నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

ఏడాదిగా సమృద్ధిగా వర్షాలు కురవకపోవడం, హెచ్‌ఎల్‌సి నీటిని విడుదల చేయకపోవడంతో మండల వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో రైతులు పంటలను కాపాడుకోవడం కోసం రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకూ అప్పులు చేసి 1000 నుంచి 1500 అడుగుల వరకూ బోర్లు వేస్తున్నారు. ఆ బోర్లలో చుక్క నీరు లేకపోవడంతో రైతులు పంటలను కాపాడుకోలేక, పెట్టుబడి కూడా రాదనే ఉద్దేశంతో పంటలను తొలగిస్తున్నారు. నాగిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన నరసింహారెడ్డి తనకున్న 3.5 ఎకరాల పొలంలో 12 ఏళ్ల నుంచి చీనీ తోట సాగు చేశారు. పంట వచ్చే సమయంలో ఏడాదిగా వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగుంటాయి. లోపల బోర్ల నుంచి చుక్క నీరు రాకపోవడంతో చీనీ చెట్లను బతికించుకొనేందుకు 2 బోర్లు వేసి రూ. 2 లక్షల వరకూ ఖర్చు చేశారు. దీంతో రూ. 8 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని రైతు నరసింహారెడ్డి వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని రైతు కోరుతున్నాడు.


ఎ.వీరేశ్ బాబును సత్కరిస్తున్న జెఎన్‌టియు ప్రిన్సిపల్ సత్యనారాయణ

అధిక ఇంధనం వినియోగంతో పర్యావరణానికి ప్రమాదం

ప్రజాశక్తి-అనంతపురం

అధిక ఇంధన వినియోగం వల్ల కర్బన ఉద్గారాలు విడుదల అయ్యి పర్యావరనానికి ప్రమాదం ఏర్పడుతుందని అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలియజేశారు. సోమవారం నాడు జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ సెమినార్ హాల్‌లో 'టూవర్డ్స్ నెట్ జీరో ఏమిసెన్స్ ' అనే అంశంపై టెక్నికల్ వర్క్ షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ అధిక ఇంధన వినియోగంతో పర్యావరణానికి కలిగే నష్టాలు, కర్బన ఉద్గారాల దుష్‌పరిణామాలను తెలుసుకోవాలన్నారు. వాతావరణ సమతుల్యత ఏర్పడితే కరువు, అడవుల్లో మంటలు ఏర్పడుతాయన్నారు. శీతోష్ణస్థితి మార్పుల వల్ల పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. సముద్ర మట్టాలు పెరగడంతో తీరప్రాంతాల మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఎన్‌ఐటి కీనోట్ స్పీకర్ ఎ.వీరేశ్ బాబు, జెఎన్‌టియు వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ బి.ఓంప్రకాష్, డా॥డిఆర్. శ్రీనివాసన్, డాక్టర్ కెఎఫ్.భారతి పాల్గొన్నారు.

పిఒ, ఎపిఒలకు శిక్షణ కార్యక్రమాలు

- పూర్తయిన ఎన్నికల సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి


ర్యాండమైజేషన్ కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా నియోజకవర్గాల పిఒలు, ఎపిఒలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల పీఓ, ఏపీఓల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,552 మంది పిఒ(ప్రిసైడింగ్ అధికారులు), 2,715 మంది ఎపిఒ (అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు)కు ఏప్రిల్ 5, 7, 14వ తేదీల్లో మూడు రోజులపాటు నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉరవకొండకు సంబంధించి ఉరవకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంతకల్లుకు సంబంధించి గుంతకల్లు డా॥సర్వేపల్లి రాధాకష్ణ మున్సిపల్ హైస్కూల్, తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, సింగనమల నియోజకవర్గానికి సంబంధించి బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఆర్‌బికె హైస్కూల్ ఫర్ హియరింగ్ ఇన్ ఫైర్ చిల్డ్రన్, కళ్యాణదుర్గానికి సంబంధించి కళ్యాణదుర్గం ఎస్వీజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి రాప్తాడు పంగల్ రోడ్ వద్దనున్న టీటీడీసీ, సిఎల్‌ఆర్సి భవనంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పోలింగ్ పర్సనల్స్ ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ విషయమై సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోలింగ్ పర్సనల్స్‌కి తెలియజేయాలన్నారు. ఎన్నికల శిక్షణకు సంబంధించిన ట్రైనింగ్ ఆర్డర్స్ పోలింగ్ పర్సనల్స్ అందరికీ వస్తాయన్నారు. పోలింగ్ పర్సనల్స్ అందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫామ్ - 12ను పూర్తి చేసుకుని శిక్షణకు వచ్చేలా వారికి ఆర్‌ఒలు స్పష్టంగా తెలపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణిసుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, రాంభూపాల్ రెడ్డి, ఈఆర్‌ఒ శిరీష, ఎన్ఐసి డిఐఒ రవిశంకర్, కలెక్టరేట్ ఏఓ అంజన్ బాబు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈఎస్ఎంఎస్ అమలు : కలెక్టర్

ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం)ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికల దష్ట్యా ఈఎస్ఎంఎస్ అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఎస్ఎంఎస్ పరిధిలో ఖచ్చితంగా డేటా అప్డేషన్ ఎప్పటికప్పుడు జరగాలన్నారు. జిల్లాలో 20 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, 3 అంతర్ జిల్లా చెక్ పోస్టులు, 4 డైనమిక్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఇక్కడ సీజర్స్ నమోదు పక్కాగా జరగాలన్నారు. సీజర్స్ నమోదుపై ఎఫ్ఎస్‌టి టీమ్‌లకు ఆర్‌ఒలు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణిసుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే మూఢనమ్మకాల నిర్మూలన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజాన్ని ప్రజలను పట్టి పీడిస్తున్న మూఢ నమ్మకాలను ప్రజా చైతన్యం ద్వారా మాత్రమే నిర్మూలించవచ్చునిజనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో సంగమేశ్వర నగర్‌లోని పీపుల్స్ లైబ్రరీ వద్ద సోమవారం నాడు మ్యాజిక్ షో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రజల్లో మూఢత్వాలను భయాన్ని ఆసరాగా చేసుకుని కొంత మంది స్వామీజీల అవతారమెత్తి మాయలు, మంత్రాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి మాయాలు మంత్రాలు లేవని ఉన్నదంతా సైన్స్ ఒక్కటే అన్నారు. సైన్స్ అంటేనే నిజమన్నారు. అలాంటి మోసగాళ్ల నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత జన విజ్ఞాన వేదికకు ఉందన్నారు. వీలైతే జిల్లా అంతట పర్యటించి విద్యా సంస్థల్లో ఇలాంటి శాస్త్రీయ దక్పథం కలిగిన మ్యాజిక్ షోలను నిర్వహించి విద్యార్థులను చైతన్యవంతం చేయాలని సూచించారు. అనంతరం జెవివి కళాకారులు ప్రసాద్, తిప్పేస్వామి సైన్స్ మ్యాజిక్ కళా ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ పి.ప్రసూన, జిలాన్, మసూద్ వలి, గాంగేనాయక్, రామిరెడ్డి, రామకృష్ణ, నూరుమహమ్మద్, మన్సూర్, శివ చరణ్, నరసింహ మూర్తి, వంశీ పాల్గొన్నారు.


జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాజిక్ షో కార్యక్రమంలో పాల్గొన్న గేయానంద్ తదితరులు

తాగునీటి సమస్యపై నిలదీత

ప్రజాశక్తి-గుత్తి

నెలలు గడుస్తున్నా తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడంపై సోమవారం పట్టణ ప్రజలు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులును నిలదీశారు. గుత్తి ఆర్ఎస్‌లోని 2వ ప్రభుత్వ పాఠశాల ప్రాంత ప్రజలు ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 55 రోజులుగా తాగునీరు సరఫరా కాలేదన్నారు. ఏడాదికి పది సార్లు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని కమిషనర్ చెప్పడంతో తమ ఇళ్ల వద్దకు ట్యాంకర్లు రాలేవని కొళాయిలు ద్వారానే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పామిడి పెన్నా నదిలో నూతనంగా బోర్లు వేశామని పైపులైన్ పనులు జరుగుతున్నాయని త్వరలో తాగునీటిని సక్రమంగా సరఫరా చేస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు వెనుతిరిగారు.

పింఛన్ల పంపిణీలో జగన్ కుట్ర

సిఎస్‌ను పదవి నుంచి తొలగించాలి : కాలవ శ్రీనివాసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాజకీయ లబ్ధి కోసం సిఎం జగన్ పింఛన్ల పంపిణీలో కుట్ర చేస్తున్నారని, ఎన్నికల కమిషన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని వెంటనే పదవి నుంచి తొలగించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కాలవ సోమవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఈ నెలలో పింఛన్లను సకాలంలో పంపిణీ చేయలేకపో తుందన్నారు. 3వ తేదీ తర్వాతే పింఛన్లు ఇస్తామని ఇదివరకే నిర్ణయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికల కమిషన్ వాలంటీర్లను పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి తప్పించిందని కుంటి సాకులు చెప్ప డం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సచివాలయ వ్యవస్థ, సిబ్బంది ఉన్నప్పుడు 1వ తేదీనే ఎందు కు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అసమర్థతను కప్పి పుచ్చేందుకు ప్రతిపక్షాలపై ఆరోపణ లు చేయడం తగదన్నారు. మీకు చేతకాకుంటే ఎన్నికల కమిషన్‌కు ఆ బాధ్యత అప్పగించాలని హితవు పలికారు. పింఛన్లు 1వ తేదీనే పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలని టిడిపి అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇదివరకే లేఖ రాసినట్లు తెలిపారు. నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా టిడిపిపై అసత్య ఆరోపణలు చేయడం హాస్యాస్పదమ న్నారు. జగన్ చేసే రాజకీయ కుట్రలో అధికారులు బలి కావద్దని సూచించారు. అధికారులు జవాబు దారీగా పని చేయాలి, రాజకీయం చేయడం తగదన్నారు. పింఛన్ల పంపిణీ విషయంలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాలవతో పాటు నాయకులు నాగరాజు, పురుషోత్తం, పూజారి తిప్పయ్య, శంకర్ ఉన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి



ఎస్సీ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న రాజశేఖర్

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా వార్డెన్ జగన్నాథ్ పట్టించుకోవడం లేదని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన సోమవారం విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్సీ హాస్టల్ ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తూ వారి అభివృద్ధికి అడ్డుగా నిలుస్తున్నారన్నారు. వార్డెన్ హాస్టల్‌లో కనీస వసతులు కల్పించడం లేదని, ఈ విషయంపై ఎఎస్‌డబ్ల్యుఒకు ఫిర్యాదు చేయగా పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఎఎస్‌డబ్ల్యుఒ పర్యవేక్షణ లేకపోవడంతోనే వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు వారు భోజనాన్ని పరిశీలిం చారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఇకనైనా హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించ పోతే విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వీరాంజనేయులుకు టిప్పర్ డ్రైవర్ల సంఘీభావం



వీరాంజనేయులును సన్మానిస్తున్న టిప్పర్ డ్రైవర్లు

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి అభ్యర్థి వీరాంజనేయులును టిప్పర్ డ్రైవర్ అంటూ హేళనగా మాట్లాడిన టిడిపి అధినేత చంద్రబాబుకు ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతామని టిప్పర్ డ్రైవర్లు హెచ్చరించారు. మండలంలోని సి.బండమీద పల్లిలో సోమవారం టిప్పర్ డ్రైవర్లు వీరాంజనేయ లుకు మద్దతు గా టిప్పర్లతో సంఘీభావం తెలిపారు. ముందుగా పార్టీ శ్రేణులతో కలిసి టిప్పర్ డ్రైవర్లు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం టిప్పర్ నడిపారు. టిప్పర్ డ్రైవర్లు మాట్లాడుతూ సిఎం జగన్ నిరు పేదకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే జీర్ణించుకోలేని చంద్రబాబు వీరాంజనేయులును టిప్పర్ డ్రైవర్ అంటూ చులకన చేసి మాట్లాడడాన్ని టిప్పర్ డ్రైవర్ల యూనియన్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. దళితులంటే చిన్న చూపుతో హేళన చేస్తూ, ఎంఎ, బీఈడీ చదివిన వ్యక్తిని అలా మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. నియోజకవర్గం లోని టిప్పర్ డ్రైవర్లందరూ కలిసి వీరాంజనే యులును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

గ్రామాల్లో వీరాంజనేయులు ప్రచారం

మండలంలోని గురుగుంట్ల, వెస్ట్ నరసాపురం, చిన్న జలాలపురం, శివపురం, బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజుకాలవ గ్రామాల్లో వైసిపి అభ్యర్థి ఎం.వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, మండల కన్వీనర్ చిక్కల బాలకృష్ణ, నాయకులు శెట్టిపల్లి నర్సింహారెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎన్వీ.నారాయణ, చిన్నమట్లగొంది శివమ్మ, చింతకాయల శ్రీనివాసులు, శివపురం రమణ, చిక్కల మల్లికార్జున, చెన్నకేశవులు, వెంకటప్ప, పోతురాజు కాలవ నాగన్న, సర్పంచి సరోజమ్మ, కార్యకర్తలు ఉన్నారు.



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న జెసి.అస్మిత్‌రెడ్డి

జెసి.అస్మిత్‌రెడ్డి ప్రచారం

పెద్దపప్పూరు : మండలంలోని ముచ్చుకోట గ్రామంలో సోమవారం తాడిపత్రి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జెసి.అస్మిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

'నవోదయ'కు కావ్య ఎంపిక



వజ్రకరూరు : ఉరవకొండ పట్టణానికి చెందిన వి.రమేష్, సౌజన్య దంపతుల కుమార్తె విజి.కావ్య నవోదయ పాఠశాలకు ఎంపికైంది. విజి.కావ్య పట్టణంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో కావ్య అర్హత సాధించినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

ఘనంగా నారాయణ పాఠశాల వార్షికోత్సవం

అనంతపురం : నగరంలోని పాపంపేటలో ఉన్న నారాయణ పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం టిటిడి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎజిఎం రమేష్ బాబు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్, హరిత, రెహానా సుల్తానా, శ్రీకాంత్, హెచ్‌ఎం రాధానాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవునిఉప్పలపాడులో ఎమ్మెల్యే తనయుడి ప్రచారం



ప్రచారం చేస్తున్న సాయిప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని దేవునిఉప్పలపాడులో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు సాయి ప్రతాపరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అవినీతికి తావు లేకుండా వాలంటరీ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి వైసిపిని గెలిపించాలని కోరారు. ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరోమారు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు అభ్యర్థించారు. ఆయన వెంట వైసిపి మండల అధ్యక్షులు రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, జడ్పిటిసి రమాదేవి, ఎంపిటిసి అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు రామ్మూర్తిరెడ్డి, గార్లదిన్నె అమర్‌నాథ్‌రెడ్డి, రాంబాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లపల్లి అంగన్వాడీ కేంద్రం తనిఖీ

నార్పల : మండలంలోని గొల్లపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం సిడిపిఒ భారతి, సూపర్వైజర్ మధుమాలిని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కేంద్రం పరిధిలోని పిల్లల ఎత్తు, పెరుగుదల, తదితర అంశాలపై ఆరా తీశారు. పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త తృణీత, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

చౌకదుకాణం డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను తప్పక అమలు చేయాలని తహశీల్దార్ రామాంజనమ్మ హెచ్చరించారు. స్థానిక ఐకెపి కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ సుజాత అధ్యక్షతన రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి డీలర్ నిత్యావసర సరుకు లను రేషన్‌కార్డుదారులందరికీ సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ప్రధానంగా డీలర్లు ఏ రాజకీయ పార్టీ తరఫునా ప్రచారం చేయకూడదని, సమావేశాల్లో పాల్గొనకూడదన్నారు. రేషన్ షాపుల వద్ద పార్టీ జెండాలు ఉంచరాదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి డీలర్ ప్రభు త్వ అధికారులకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోండి : ఎంపిడిఒ

నార్పల : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రాముడు సూచించా రు. మండలంలోని చామలూరు గ్రామపంచాయతీలో సోమవారం సాయంత్రం ఉపాధి పనులపై కూలీ లతో ఎంపిడిఒ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం దిన కూలిని రూ. 272 నుంచి రూ. 300 పెంచిందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశంలో ఉండి 10:30కు పని పూర్తి చేసుకొని ఇంటికి చేరుకోవాలని సూచించారు. కూలీలు పని ప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూలీలు వలస పోకుండా గ్రామంలోనే ఉపాధి పనులు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో ఎపిఒ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ హరిస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్, ప్రజలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

241 మంది వాలంటీర్ల రాజీనామా

తాడిపత్రి రూరల్ : మండలంలోని పలు గ్రామాల వాలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పింఛన్ల పంపిణీలో వాలంటీర్లను వినియోగించొద్దన్న ఎన్నికల సంఘం ఆంక్షలతో వారంతా రాజీనామా చేస్తున్నట్లు వాలంటీర్లు తెలిపారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ బివి.నరసింహారావుకు అందజేసినట్లు తెలిపారు. సిఎం జగన్ కోసం తాము నేరుగా కష్టపడి పని చేస్తామని వాలంటీర్లు తెలిపారు.

నార్పలలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

నార్పల : ఉన్నతాధికారుల సూచనల మేరకు సోమవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వెంకటంపల్లి, గడ్డంనాగేపల్లి, నడిమిదొడ్డి, కేసేపల్లి గ్రామాల్లో బిఎస్ఎఫ్ డీఎస్పా ధర్మేంద్ర, శింగనమల, నార్పల ఎస్ఐలు శ్రీధర్, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని, ప్రజలు స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొనాలని భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు వారు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రాయదుర్గం : గత నెల 11వ తేదీ మండలంలోని 74-ఉడేగోళం గ్రామం వద్ద జాతీయ రహదారిపై గ్రామానికి చెందిన విద్యార్థి రామ్‌చరణ్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విద్యార్థి వైద్య ఖర్చులకు సోమవారం అంబేద్కర్ రక్తదాత సంస్థ ప్రతినిధి మురళి ఆధ్వర్యంలో దాతల సాయంతో రూ. 17 వేల జెవివి రాష్ట్ర కార్యదర్శి బిఎం నాదల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోటేష్, మనోజ్, బంగి శివ, మురళి పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరులో సోమవారం పలువురు వైసిపి నాయకులు బాలాజీ సమక్షంలో టిడిపిలో చేరారు. బందూకు తిమ్మరాజు, బందూకు లక్ష్మయ్య, బందూకు ఈరయ్య, బందూకు తిమ్మరాయుడు, బందూకు శీన, బందూకు తిమ్మరాయుడు, బందూకు చిరంజీవి, బందూకు రాము, బందూకు విజయ్, బందూకు తిమ్మరాజు టిడిపిలో చేరగా బాలాజీ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే, ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, అరాచ కాలకు విసిగిపోయామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు టిడిపితోనే సాధ్యమని, నియోజకవర్గ అభివృద్ధి పరిటాల సునీతతోనే సాధ్యమని నమ్మి టిడిపిలో చేరామన్నారు. ఎన్నికల్లో పరిటాల సునీత గెలుపు కోసం కష్టపడి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివా సులు, మాధవరెడ్డి, దుబ్బ రవీంద్రరెడ్డి, మనోరంజన్ గడిపూటి నారాయణస్వామి, పిల్లల ప్రతాప్, పాపంపల్లి శ్రీనివాసరెడ్డి, పలమాసి సూర్యనారాయణ పాల్గొన్నారు.



బాలాజీ సమక్షంలో టిడిపిలో చేరిక నాయకులు

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : పట్టణంలోని కెజిబివిలో 6, 7, 8 తరగతుల్లో ఖాళీ సీట్ల కోసం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎం.రుద్రాక్షి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీ లోపు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫస్ట్ ఇంటర్‌లో నర్సింగ్ కోర్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తాడిపత్రిలో రూ.1.31కోట్ల నగదు సీజ్



పోలీసులు సీజ్ చేసిన నగదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగయ్య

ప్రజాశక్తి-తాడిపత్రి

ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 1.31 కోట్ల నగదును తాడిపత్రి పోలీసులు సీజ్ చేశారు. వివరాలను డీఎస్పీ సిఎం గంగయ్య సోమవారం ఉదయం విలేకరులకు వెల్లడించారు. తాడిపత్రి పట్టణంలో శనివారం రాత్రి కొందరు డబ్బు తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులకు అందింది. దీంతో తాడి పత్రి డీఎస్పీ సిఎం గంగయ్య ఆధ్వర్యంలో సిఐలు మురళీకృష్ణ, లక్ష్మికాంతరెడ్డిలు పోలీసులు, సెబ్ అధికారులతో కలిసి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా తాడిపత్రి బస్టాండు వద్ద తాడిపత్రి పట్టణం మెయిన్ రోడ్డుకు చెందిన షేక్ మస్తాన్ వలీ, షేక్ నజీమున్నీషా, షేక్ రషీదాల వద్ద రూ.1,31,35,750 నగదు లభించింది. దీనికి సంబంధించి ఎలాంటి పత్రాలూ చూపకపోవడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నగదు తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి ఇంట్లో ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. పట్టుబడిన నగదును ఐటి అధికారులకు అప్పగించారు. కాగా పట్టుబడిన ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరు కేరళ, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలలో బంగారు కొనుగోలు చేసి తాడిపత్రిలో అధిక ధరలకు విక్రయిస్తుంటారని పోలీసులు తెలియజేశారు.



ఆకుల లక్ష్మీరాయ్‌ని సన్మానిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

గానలహరి-2024 సమ్మేళనంలో ఆకుల లక్ష్మీరాయ్‌కు సన్మానం

నార్పల : ఉగాది వేడుకల్లో భాగంగా ఆదివారం బెంగళూరులో కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య, ఇండో ఏషియన్ అకాడమీ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్ర మణ్యం స్మృత్యర్థం 'గానలహరి-2024' పేరిట జాతీయస్థాయి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అందులో నార్పల విద్యార్థిని ఆకుల లక్ష్మీరాయ్ పాల్గొని ప్రతిభ చూపడంతో సమాఖ్య ప్రతినిధులు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించా రు. పోటీల్లో 6 నుంచి 60 ఏళ్ల వయసున్న 4 రాష్ట్రాలకు చెందిన 60 మంది గాయనీ, గాయకులు పాల్గొన్నారు. శాస్త్రీయ, జానపద, సినీ సంగీత నేపథ్యం కలిగిన పలు వురు సీనియర్ గాయకులతో పాటు బాల బాలికలు అద్భుతంగా పాటలు పాడి సంగీత అభిమానులను అలరించాయి.

3న పింఛన్ల పంపిణీ : ఎంపిడిఒ

నార్పల : ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి అన్ని సచివాలయాల వద్ద సచివాలయ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపిడిఒ రాముడు తెలిపారు. పింఛను లబ్ధిదారులు పింఛను పుస్తకం తీసుకురావాల్సిన అవసరం లేదని, కేవలం ఆధార్ కార్డు తీసుకొస్తే సరిపోతుందన్నారు. వృద్ధులు, వికలాంగులకు సచివాలయ ఉద్యోగులే ఇళ్ల వద్దకు వచ్చి పింఛను సొమ్ము అందజేస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లను ఆశ్రయించకూడదన్నారు. ఇప్పటికే అన్ని సచివాలయాల పరిధిలో గ్రామ వాలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పింఛను పంపిణీ కేంద్రాల వద్ద రాజకీయ ప్రస్తావన, రాజకీయ చర్చలు ఉండరాదని ఆదేశించారు. మజారా గ్రామాలు ఉన్న పంచాయితీలో కార్యదర్శి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు పింఛను పంపిణీ అప్పజెప్పాలన్నారు.

వ్యక్తులను కాదు పార్టీని చూడండి..!

శింగనమల అసమ్మతి నాయకులతో సిఎం జగన్

ప్రజాశక్తి-నార్పల

'వ్యక్తులను కాదు కన్నతల్లి లాంటి పార్టీని చూడండి' అని సిఎం జగన్ శింగనమల నియోజక వర్గ వైసిపి అసమ్మతి నాయకులతో అన్నట్లు విశ్వసనీయ సమాచారం. బత్తలపల్లి మండలంలోని సంజీపురం వద్ద ఆదివారం రాత్రి సిఎం జగన్ బస చేశారు. ఆ శిబిరం వద్ద సోమవారం ఉదయం శింగనమల నియోజకవర్గ వైసిపి అసమ్మతి నాయకులు జగన్‌ను కలిశారు. వారితో జగన్ మాట్లాడుతూ కన్నతల్లి లాంటి పార్టీ కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని పని చేయాలని కోరారు. వ్యక్తులు ముఖ్యం కాదు.. పార్టీ ముఖ్యమని, మీ అందరి అభిప్రాయాన్ని గౌరవించే ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశంతో సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని కాదని నిరుపేద, ఉన్నత విద్యావంతుడైన వీరాంజనేయులు పేరును ఖరారు చేశామని తెలిపారు. అటువైపు ప్రతిపక్ష పార్టీలు కూటమిగా ఏర్పడి కష్టపడుతుంటే మనం సొంత పార్టీలోనే వర్గాలుగా విడిపోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కష్టపడే కార్యకర్తలు, నాయకులకు పార్టీలో ఎప్పుడూ విలువ ఉంటుందని, విభేదాలను పక్కనపెట్టి సమిష్టిగా ముందుకు సాగాలని ఆదేశించినట్లు తెలిసింది. జగన్‌తో భేటీ తర్వాత అసమ్మతి నాయకులందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పని చేస్తారా లేక రెబల్ అభ్యర్థిని బరిలోకి దింపుతారా, పార్టీ మీద అభిమానంతో ఇతర నియోజకవర్గాలకు వలస వెళ్తారో వేచి చూడాలి. ఏదేమైనా జగన్ సానుకూల స్పందనతో అసమ్మతి నాయకులు పునరాలోచనలో పడ్డట్లు విశ్వసనీయ సమాచారం.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా


పయ్యావుల కేశవ్



ఓట్లు అభ్యర్థిస్తున్న పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ నియోజకవర్గ ప్రజలే నా బలం, బలహీనత.. వారి అభివృద్ధి కోసం ఎంత వరకైనా పోరాటం చేస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 30 ఏళ్లుగా రాజకీయ ఎదుగుదలకు కారణమైన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. ఉరవకొండ పట్టణంలోని చౌడేశ్వరీకాలని, అంబేద్కర్ నగర్, ఇందిరా నగర్ కాలనీల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ముందుగా చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టిడిపి పథకాలను ప్రజలకు వివరించి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



విక్రమసింహాను సన్మానిస్తున్న గ్రామస్తులు

విక్రమసింహా విస్తృత ప్రచారం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ కోసం ఆయన తనయుడు విక్రమసింహా స్థానిక నాయకులతో కలిసి విస్తృత ప్రచారం చేపట్టారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' లో భాగంగా ఆయన వజ్రకరూరు మండలంలోని పిసి ప్యాపిలి గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి కేశవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట టిడిపి నాయకులు వెంకటేశులు, నాగేంద్ర, శీనప్ప, లక్ష్మమ్మ, గోవిందు, వెంకటసాయి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-శింగనమల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి యోగేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. సమావేశానికి ఎంపిడిఒ రమణ, వైస్ ఎంపిపి నర్సింహులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరయ్యారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమస్యలకు పరిష్కారం చేయలేక పోతున్నామని తెలిపారు. పెద్దమట్లగొంది సర్పంచి రమేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్యపై ప్రతి సమావేశంలో ప్రస్తావించినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూలాకాలవ పంచాయతీ రాజా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో సర్పంచులు సొంత ఖర్చులతో వీధిలైట్లు వేయించగా నిధులు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. సమావేశంలో అన్వేష్‌కుమార్, ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ, విద్యుత్ ఏఈ విజయ్‌కుమార్, ఈఓఆర్డి మురళీకృష్ణ, ఎంఈఓ నరసింహరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉమాదేవి, ఎంపిటిసి మొరార్జీ, చిన్న జయన్న, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పేదలను యజమానులను చేయడమే బీఎస్పీ ధ్యేయం

ఎమ్మెల్యే అభ్యర్థి చిందనూరు నాగరాజు

ప్రజాశక్తి-రాయదుర్గం

పేదలను యజమానులుగా చేయాలనే లక్ష్యంతో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ముందుకెళ్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చిందనూరు నాగరాజు పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 23వ వార్డులో విస్తృత ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అధికార వైసిపి అనేక ఉచితాలు అందిస్తూ ప్రజలను సోమరిపోతులను చేస్తోందని విమర్శించారు. ప్రజలను బిచ్చగాళ్లుగా చేసేలా ప్రస్తుత రాజకీయ పార్టీలు ముందుకెళ్తున్నాయ న్నారు. అందుకు భిన్నంగా బీఎస్పీ పేదలను యజమానులను చేయాలనే లక్ష్యం తో పని చేస్తుందని, ప్రజలు ఎన్నికల్లో బీఎస్పీకి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఉలిగప్ప, నాయకులు నాగరాజు, నర్సింగ్‌యాదవ్, వన్నూరక్క, శంకరమ్మ, మంజుల, మల్లికార్జున పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిలకు న్యాయం

బిసి సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌నాయుడు


ప్రజాశక్తి-గుంతకల్లు

చంద్రబాబుతోనే రాజకీయాల్లో బిసిలకు న్యాయం జరిగిందని వాల్మీకి సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన జిల్లా వాల్మీకి సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో బిసి సామాజిక వర్గంలోని వాల్మీకి వర్గానికి ఎక్కువ సీట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అవుతాయ న్నారు. అనంతపురం ఎంపిగా అంబికా లక్ష్మి నారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయ రాంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆశావహులు పార్టీ కోసం ఎంతో కృషి చేశారని, వారికి అధిష్టానం భరోసా ఇవ్వాలన్నారు. సమావేశంలో వాల్మీకి సహకార సంఘం నాయకులు నాగరాజు, మల్లికార్జున, బాలరాజు, మోహన్, సోము పాల్గొన్నారు.

పింఛనుదారులకు వసతులు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని సచివాలయాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎండ నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పింఛను తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు వస్తారని ఎండలు ఎక్కువగా ఉన్నందున వారు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున పట్టణంతో పాటు ప్రతి గ్రామంలో గ్రామ, వార్డు సచివాలయాల వద్ద షామియానాలు, తాగునీరు, మజ్జిగ, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు జగ్గలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు చొక్కా సునీల్ కుమార్, రామునాయక్, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ వెంకట రమణయ్యకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE KUNROOL AT ADONE
A.S.NO.23/2017

Between:
Syndicate Bank, Adoni Branch, rep by its Present Manager. ...Appellant

Versus

K.A.Ramachandran and another. ...Respondents

To
2. K.D.S.C.Das S/o K.U.Ramadas,
Door No.17-1104, Rajeev Nagar, Guntakal Post,
Anantapur District.

Whereas the above named appellant Bank has filed the above appeal against the decree and judgment passed in O.S.No.246/16 on the file of the Hun'ble Principal Junior Civil Judge's Court, Adoni dated 18-04-2017 and that the 23rd day of April, 2024 has been fixed by this Court for the hearing of this appeal.

If no appearance is made your behalf by yourself, your pleader or by someone by Law authorized act for you in this appeal, it will be heard and decided in your absence.

// BY ORDER OF THE COURT //
Date of Hearing : 23-04-2024.

Sd/- **Sri P.Jaya Theertha,**
Advocate for Appellant.
Adoni.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు, గుత్తి
S.O.P .No :6/2024

Between:
1.సింగపు రమేష్ బాబు,
2.సింగపు కిషోర్ కుమార్ ...అర్జీదారులు

ఎదిరి

నిల్.. ...రెస్పాండెంట్లు

పబ్లిక్ నోటీసు

పైన కనపరచిన అర్జీదారులైన 1.సింగపు రమేష్ బాబు, 2.సింగపు కిషోర్ కుమార్ Late S.P.కేశవ పిళ్ళై కుమారులు, ఇంటి నెం.7/97, కురుబ వీధి, గుత్తి, అనంతపురం జిల్లా. వీరి తండ్రి గారికి సంబంధించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మ్యూచువల్ ఫండ్స్‌లో బ్యాంకులో వుండబడిన నగదు నిమిత్తము గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు ఎస్.ఓ.పి.నెం.6/2024 వారసత్వ సర్టిఫికేట్ కొరకు దావా దాఖలు చేసివున్నారు. కోర్టు వారి ఉత్తర్వుల మేరకు దావాకు సంబంధించి అభ్యంతరాలు, ఆక్షేపనల కొరకు దినపత్రిక ద్వారా ప్రచురితమైన నోటీసు జారి చెయ్యటము అయినది. కావున 18/04/2024వ తేదిన ఉదయం 10-00 గంటలకు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలసి ఉన్నది.

Z.సతీష్ , అడ్వకేట్, గుత్తి.

డాక్యుమెంటు పోయినది

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం:3326 తేది 1971 కుప్పం చిన్న నారాయణప్ప తండ్రి:కుప్పం కోటయ్య, గుత్తి గారి పేరుతో వున్న డాక్యుమెంటు, అనంతపురం ఆర్.టి.సి బస్టాండులో వేచి వున్నప్పుడు పోయినది. సదరి పత్రము ఎవరికైన దొరికినచో ఈ క్రింది చిరునామాకు తెలియజేయ గలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్॥డి॥కి చేరిన ఉప్పరపల్లె గ్రామ పొలంలోని ఆస్తి వివరం.
Plot No:37 **S.No:94/2** కు
చెక్కుబంది:
తూరు:30 అడుగుల రోడ్డు, పడమర:Plot No:27,
ఉత్తరం:Plot No:38, దక్షిణం: Plot No:36,

కుప్పం మనోరంజని
W/o Late కుప్పం లక్ష్మణస్వామి,
D.No:10-33, వాసవి బజారు, గుత్తి,
సెల్:9848141712, 9866671788